కొత్త పనులకు నిధులు..!

- 13 నియోజకవర్గాలకు రూ.130 కోట్లు
- నియోజకవర్గాలపై దృష్టి సారించిన ప్రభుత్వం
- ఎస్‌డీఎఫ్ కింద నియోజకవర్గానికి రూ.10 కోట్లు
- ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు అనుమతితో నిధులు
- తాగునీటి వసతి, సర్కారు బడులకు మహర్దశ



సాక్షి, మేడ్చల్ జిల్లా: అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈమేరకు వివిధ రకాల పనులు చేపట్టేందుకు ఎస్‌డీఎఫ్ (ప్రత్యేక అభివృద్ధి నిధులు) కింద ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్లు మంజూరు చేసింది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలోని 13 నియోజకవర్గాలకు రూ.130 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో చేపట్టే పనులు గతంలో ఏ పథకం కింద చేపట్టి ఉండకూడదనే షరతు విధించింది. ఆయా నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన పనుల వివరాలను సేకరించే పనిలో రెండు జిల్లాల అధికారులు నిమగ్నమయ్యారు.

ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు అనుమతి తప్పనిసరి..

ప్రభుత్వం కేటాయించే నిధులతో చేసే పనులకు సంబంధించి సంబంధిత కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రుల అనుమతి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలను అధికారులు తొలుత ఆయా జిల్లాల కలెక్టర్లకు నివేదిస్తారు. కలెక్టర్ల అనుమతితో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరిశీలనకు పంపిస్తారు. శ్రీధర్‌బాబు అనుమతితోనే నియోజకవర్గాల్లో నూతన పనులు చేపడతారు. ఈ క్రమంలో నిబంధనలు పాటించడంతో పాటు నిర్దేశించిన ప్రమాణాల మేరకు పనులు జరిగేలా ఇన్‌చార్జి మంత్రి, సంబంధిత కలెక్టర్ పర్యవేక్షిస్తారు.

తాగునీటి అవసరాలకు రూ.కోటి

అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాగునీటి అవసరాల కోసం రూ.కోటి కేటాయించారు. శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాగునీటి అవసరాలను తీర్చడం కోసం రూ.13 కోట్లు కేటాయించనున్నారు. కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం ఒక్కో నియోజకవర్గానికి రూ.50 లక్షల చొప్పున 13 నియోజకవర్గాలకు రూ.6.50 కోట్లు కేటాయించారు. ఒక్కో నియోజకవర్గంలో రూ.3.50 కోట్లు ప్రత్యేక అవసరాల కోసం ఖర్చు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. మిగతా రూ.6.50 కోట్లతో ఇతర అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం వెచ్చించనున్నారు. పనులు గుర్తించడం, నిధులు కేటాయించడం వంటివి కలెక్టర్, ఇన్‌చార్జ్ మంత్రి ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. తద్వారా నిధులు దుర్వినియోగం కావని, ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని సర్కారు భావిస్తోంది

సర్కారు బడులకు నిధులు

సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక అభివృద్ధి నిధులతో మహర్దశ పట్టనుంది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మన ఊరు- మన బస్తీ- మన బడి పథకం కింద చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. చాలా పాఠశాలల్లో విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేక తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) ప్రకటించింది. ఈ నిధుల్లో నుంచి ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి ప్రత్యేకంగా సర్కారు బడుల్లో మౌలిక వసతుల కోసం రూ.2 కోట్లు ఖర్చు చేయాలని నిర్దేశించింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలతోపాటు సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నారు. అవసరమైనచోట సర్కారు బడుల్లో క్రీడా మైదానాలు తదితరాలు సమకూరే అవకాశముంది.

శివారుల్లో 13 శాసనసభా నియోజక వర్గాలు

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ఉండగా, రంగారెడ్డి జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, చెవేళ్ల, షాద్‌నగర్ ఉన్నాయి.

ప్రత్యేక అభివృద్ధి నిధుల(ఎస్‌డీఎఫ్) వివరాలు ఇలా..

- శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో అసెంబ్లీ నియోజకవర్గాలు: 13.
- ఒక్కో నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 కోట్లు.
- శివారు జిల్లాలకు మంజూరైన నిధులు రూ.130 కోట్లు.
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.26 కోట్లు.
- తాగునీటి అవసరాల కోసం: రూ.13 కోట్లు.
- కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ రూ.6.50 కోట్లు.
- శివారు జిల్లాల్లో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు: 1,816.

పొగాకు నియంత్రణపై పోరాటం

- 20 ఏళ్లుగా ఎన్నో అవగాహన కార్యక్రమాలు
- సేవలను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ



డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కేశవరం గ్రామానికి చెందిన మాచన రఘునందన్ 20 ఏళ్లుగా పొగాకు నియంత్రణపై పోరాటం చేస్తున్నారు. ఆయన రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూనే.. పొగాకుపై ఉద్యమం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో కృషి చేస్తున్న ఆయనను రిసోర్స్ సెంటర్ ఫర్ టొబాకో' కంట్రోల్ స్టాల్ వర్ట్'గా గుర్తించింది. అమెరికాకు చెందిన హెల్త్ మ్యాగజైన్ పల్మనరీ మెడిసిన్ కూడా ఆయన సేవలను గుర్తించి కొనియాడింది. ఆరోగ్యానికి చేటు చేస్తున్న పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని కూకటివేళ్లతో పెకిలించే చైతన్యం సమాజం నుంచే రావాలని ఆయన అన్నారు.

- గతంలో ట్విట్టర్, ప్రస్తుతం ఎక్స్ ద్వారా పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా చేస్తున్న ప్రచారం, జర్మనీని ఆకట్టుకోగా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం తగిన గుర్తింపు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు.
- చండీగఢ్‌కు చెందిన పొగాకు నియంత్రణ అంతర్జాతీయ వేదిక 'రిసోర్స్ సెంటర్ ఫర్ టొబాకో కంట్రోల్'లో ఆయన దక్షిణ భారత్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ గౌరవ ప్రతినిధిగా పాల్గొన్నారు. – – రెండు దశాబ్దాలుగా ఆయన హైదరాబాద్, నల్గొండ, వరంగల్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల్లో పొగాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తూ.. యువతకు పొగాకుతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం పలు పరిశ్రమలకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్ చెక్ పోస్ట్ వద్ద గల అన్ని పరిశ్రమలకు, కిష్టాపూర్ రోడ్డులోని పరిశ్రమలకు, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

చెట్లు నరికేస్తున్నా నిర్లక్ష్యమేలా..?



కీసర: గోధుమకుంట గ్రామ పరిధిలోని సర్వే నంబర్-42లో ఉన్న హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో చెట్లను అక్రమంగా శనివారం నరికివేశారు. పచ్చని చెట్లను నరికివేసిన వారిని అధికారులు గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవైపు మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం చెబుతున్నా మరోవైపు చెట్లు నరికివేతకు గురికావడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి చెట్లు నరికివేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో ఐక్యత భావం



ఘట్‌కేసర్: క్రీడల వల్ల యువతలో ఐక్యత పెరుగుతుందని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్‌లోని ద్రోణాచార్య క్రికెట్ మైదానంలో కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవుషాపూర్ క్రికెట్ లీగ్(ఏపీఎల్)ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. కాగా లీగ్‌లో అవుషాపూర్‌కు చెందిన పది జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ భిక్షపతిగౌడ్, ఐలయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వీరేశం, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు వామన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, వీరేశ్‌యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు ప్రాక్టికల్ ఎగ్జామ్



ఘట్‌కేసర్: అనురాగ్ విశ్వవిద్యాలయానికి చెందిన 26 మంది ఎన్‌సీసీ కేడెట్లు ప్రాక్టికల్ ఎగ్జామ్‌కు హాజరయ్యారు. రెండు సంవత్సరాలు శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న కేడెట్లకు సికింద్రాబాద్‌లోని బైసన్ గ్రౌండ్‌లో శనివారం ప్రాక్టికల్ ఎగ్జామ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీటీఓ డాక్టర్ సి.మల్లేశ్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందనడం సిగ్గుచేటు



చౌదరిగూడలో మాట్లాడుతున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్

ఘట్‌కేసర్: రాజ్యాంగ ప్రకారం ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అనడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌదరిగూడలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ పీర్జాదిగూడ, బోడుప్పల్ నాయకులు ఎమ్మెల్యేకు బ్రోకర్‌గా మారారని, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి భుజస్కందాలపై నడిపించడంతో రూ.200-300 కోట్లు ఖర్చు పెట్టిన మల్లారెడ్డికి నామమాత్రం మెజార్టీ వచ్చిందన్నారు. బాబురావు, అనిల్‌గౌడ్, భోజిరెడ్డి, బాల్‌రాజ్‌యాదవ్, కుమార్‌ముదిరాజ్, వినోద్, అంజనేయులుగౌడ్, అమర్, సల్మాన్, కృష్ణ, శంకర్, నర్సింహ, మహేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ సెట్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాలలో సామాజిక ఆవిష్కరణలపై ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బిడ్ టూ బిజినెస్ పేరిట ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమాన్ని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి ప్రారంభించగా అనంతరం విద్యార్థి బృందాలు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 3 బృందాలకు కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సురేశ్ రామ్, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కేలండర్ ఆవిష్కరణ



ఘట్‌కేసర్: పట్టణంలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షుడు బర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం ముదిరాజ్ సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ శశికళ, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, రాధాకృష్ణముదిరాజ్, శ్రీశైలంముదిరాజ్, శంకర్‌ముదిరాజ్, పోచయ్య ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, రవిముదిరాజ్, బలరాంముదిరాజ్, లక్ష్మయ్యముదిరాజ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

జీపీ ప్రత్యేకాధికారుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను బాధ్యతతో సక్రమంగా నిర్వర్తించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్ర మంత్రి అనసూయ(సీతక్క) వీడియో కాన్ఫరెన్స్ అనంతరం శనివారం కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం సూచించిన విధంగా నడుచుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పని చేయాలని కోరారు. ఈ నెల 7 నుంచి 15 వరకు నిర్వహించే స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ (ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం) విజయవంతం అయ్యేలా ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇందులో యువతను ప్రోత్సహించి వారిని భాగస్వామ్యం చేసి సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధి హామీ కూలీల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

డీఎం హెచ్‌ఓ డాక్టర్ రఘునాథ్‌స్వామి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి కోరారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అల్బెండజోల్ మాత్రలను పాఠశాల వయస్సు పిల్లలకు వేయడం ద్వారా నులిపురుగుల నిర్మూలన లక్ష్యంగా ముందుకెళ్లాని డీఎంహెచ్‌ఓ రఘునాథ్‌స్వామి సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ మీడియా అధికారి అంజయ్య, వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

మేడ్చల్‌రూరల్: యువ ఇంజినీరింగ్ విద్యార్థులు ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని, నూతన ఆలోచనలతో సమాజానికి సహాయం అందించాలని ఎంఎస్ఎంఈ హైదరాబాద్ అదనపు అభివృద్ధి కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరితో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు మరింత నైపుణ్యం, ఫ్రేమ్ వర్క్, కొత్త ఆలోచనలు వస్తాయని, అవి కెరీర్ అభివృద్ధికి సహాయ పడతాయని అన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అన్ని ప్రయోజనాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, కళాశాల అధ్యాపకులు, పలు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రతినిధులు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఘనంగా కమ్యూనిటీ హెల్పర్స్ ఎక్స్‌పో



కమ్యూనిటీ హెల్పర్స్ ఎక్స్‌పోలో చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ న్యూహనుమాన్ నగర్‌లోని రైసింగ్ బడ్స్ ప్లే స్కూల్‌లో కమ్యూనిటీ హెల్పర్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ చంద్రారెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవా రంగాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంలో విద్యా సంస్థలు కీలక భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల దేవి, కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస రగడ

- ఈ నెల 19న అవిశ్వాసానికి గ్రీన్ సిగ్నల్
- జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ కిడ్నాప్ కలకలం
- పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో అవిశ్వాస రగడ వేడెక్కింది. జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్యపై పెట్టిన అవిశ్వాస తీర్మానానికి కలెక్టర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బల నిరూపణకు ఇరు వర్గాలు ఢీ అంటే ఢీ అంటున్నాయి. కావ్యపై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ 18 మంది కార్పొరేటర్లు గతనెల 24న కలెక్టర్‌కు తీర్మాన ప్రతిని అందజేసి అసమ్మతి కార్పొరేటర్లు ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోని రహస్య ప్రాంతంలో క్యాంపునకు తరలివెళ్లారు.

కనిపించని కార్పొరేటర్లు..

అవిశ్వాస తీర్మానం అనంతరం 18 మంది అసమ్మతి కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్‌తో క్యాంపునకు వెళ్లారు. మేయర్‌తో పాటు 8 మంది కార్పొరేటర్లు జవహర్‌నగర్‌లో ఉన్నారు. శుక్రవారం రాత్రి 10వ డివిజన్ కార్పొరేటర్ గండి రాంచందర్ కనిపించకుండా పోయారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ వద్ద మేయర్ వర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు సినీ ఫక్కీలో రాంచందర్‌ను తమ వెంట తీసుకెళ్లి కిడ్నాప్ చేశారని అసమ్మతి కార్పొరేటర్లకు సంబంధించిన వ్యక్తులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కార్పొరేటర్‌ను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నం..

జవహర్‌నగర్‌లో ఉన్న 10వ డివిజన్ కార్పొరేటర్ గండి రాంచందర్‌ను గుర్తుతెలియని వారు ఎత్తుకెళ్తున్నారని సమాచారం రావడంతో తాము వెళ్లి రక్షించామని 5వ డివిజన్ కార్పొరేటర్ ఏకే మురుగేష్ తెలిపారు. జవహర్‌నగర్ నుంచి బయలుదేరిన వారు దాదాపు 3 నుంచి 4 కార్లను మార్చి కార్పొరేటర్‌ను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించడంతో అతడి కుమారుడి సమాచారంతో రక్షించామన్నారు.



కార్పొరేటర్లకు కాసుల పంట

జవహర్‌నగర్ మేయర్‌పై అవిశ్వాసం అనంతరం ఇరు వర్గాల నుంచి కార్పొరేటర్లకు కాసుల పంట పండుతోంది. మేయర్ వర్గం నుంచి అసమ్మతి వర్గంలోని కార్పొరేటర్లకు పెద్దఎత్తున ఆఫర్ ప్రకటిస్తుండంతో వారు సైతం మేయర్ వర్గానికి గాలం వేస్తుండంతో రాజకీయం మరింత వేడెక్కింది. ప్రస్తుతం ఇరు వర్గాల వారు క్యాంపు రాజకీయం చేయడంతో అక్కడ ఇద్దరు, ఇక్కడ ఇద్దరే టార్గెట్‌గా వ్యూహం రచిస్తున్నారు.

పార్లమెంట్ స్థానానికి సత్యనారాయణ దరఖాస్తు



మేడ్చల్: మేడ్చల్ పట్టణానికి చెందిన అన్నె సత్యనారాయణ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థానాన్ని కేటాయించాలని నగరంలోని గాంధీ భవన్‌లో శనివారం దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా పని చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ నా సేవలు గుర్తించి పార్లమెంట్ స్థానాన్ని కేటాయిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

గద్దర్ పురస్కారాలు హర్షణీయం

మల్లాపూర్: కవులు, కళాకారులు, సినీప్రముఖులకు యుద్ధనౌక గద్దర్ పేరుతో పురస్కారాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినందుకు టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ హెచ్‌ఆర్.మోహన్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం నాచారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గతం ప్రభుత్వం కవులు, కళాకారులను పట్టించుకోలేదన్నారు. బండారి రఘు, నూతలకంటి రాజు, అబ్రహం, అమర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతున్న బాలుడి మృతి

- చికిత్స పొందుతున్న తల్లి

మేడ్చల్‌రూరల్: ఆరోగ్యం బాగా లేకపోవడంతో తన బిడ్డతో విషం తాగించి తాను సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో బాలుడు మృతి చెందగా తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మేడ్చల్ మండలంలో చోటు చేసుకుంది. సీఐ నర్సింహారెడ్డి వివరాల ప్రకారం మండలంలోని గౌడవెల్లి గ్రామానికి చెందిన కండ్లకోయ నర్సింహ కుమార్తె హైమావతి(30) నాలుగేళ్ల క్రితం భర్తతో విడిపోయి కుమారుడు అభివర్షన్(06)తో పాటు గౌడవెల్లిలో తల్లిదండ్రుల వద్ద నివాసం ఉంటోంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మనస్థాపం చెంది ఈ నెల 1వ తేదీన సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డి మందును కుమారుడు అభివర్షన్‌కు తాగించి, తానూ తాగింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం వారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం బాలుడు అభివర్షన్ మృతి చెందాడు. తల్లి హైమావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు గూడు కల్పించిన మహనీయుడు

జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ కారింగుల నర్సింగరావు వర్ధంతి



జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ నర్సింగరావ్ వర్ధంతిలో నాయకులు

జవహర్‌నగర్: రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వలస వచ్చిన పేదలకు గూడు కల్పించిన మహనీయుడు నర్సింగరావు అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ అన్నారు. జవహర్‌నగర్ పూజీ సర్పంచ్ కారింగుల నర్సింగరావు 25వ వర్ధంతిని శనివారం బాలాజీనగర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి పలువురు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు హాజరై ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన ఆయన తన జీవిత కాలమంతా పేద ప్రజల కోసమే పోరాడి పేదలకు ఇండ్ల పట్టాలు తెప్పించిన మహనీయుడని కొనియాడారు. ఆయన సేవలను ప్రజలు మరిచిపోరన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. అనంతరం పట్టణ ప్రజలతో పాటు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిహారికగౌడ్, కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, కాంగ్రెస్ నాయకుడు కారింగుల రాజుగౌడ్, ప్రజా కళాకారుడు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యురాలు స్వప్న పాల్గొని మాట్లాడుతూ కేన్సర్ పట్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. నేటి సాంకేతికత సాయంతో కేన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చని, వైద్యంతో నివారించవచ్చని వివరించారు. ధూమపానం, మద్యానికి దూరంగా ఉండాలని తరచూ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలని, సరైన వ్యాయామం చేయాలని సూచించారు. కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం మాట్లాడుతూ విద్యార్థులు ప్రజలకు కేన్సర్ పట్ల ఉన్న భయాన్ని తొలగించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డీన్ రామదాసు, కన్వీనర్ శైలజ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కా ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలు



శామీర్‌పేట్: కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ జెడ్పీటీసీ నక్కా ప్రభాకర్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం శామీర్‌పేట్‌లో ఘనంగా జరిగాయి. ఎన్‌పీజే డ్రీమ్ వ్యాలీలో నిర్వహించిన వేడుకల్లో మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్‌రావు, సుధీర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, నియోజకవర్గంలోని పలు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొని కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.